క్లుప్తంగా

క్రీడాకారులకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న కోచ్ సునీల్ రెడ్డి

కొమ్మాది: చిత్తూరు జిల్లాలో ఇటీవల 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరిగిన 10వ సబ్ జూనియర్స్ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో సాగర్‌నగర్‌కు చెందిన బాలుర జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. ఈ పోటీల్లో సాగర్‌నగర్ బాస్కెట్‌బాల్ అకాడమీకి చెందిన క్రీడాకారులు ముఖ్యపాత్ర పోషించారు. బాలుర విభాగంలో ప్రతిభ కనపరిచిన వాట్సన్, నీల్, కృష్ణ, పరాశర్, నాయుడులను కోచ్ సునీల్ రెడ్డి అభినందించారు.

44 మందికి కళ్లద్దాల పంపిణీ



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కీతిన్‌పేట సన్‌స్కూల్ వద్ద బుధవారం కంటి అద్దాల పంపిణీ జరిగింది. ఇటీవల భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ (బీఎన్‌డబ్ల్యూ) ఆధ్వర్యంలో ఉచిత కంటివైద్య శిబిరం జరిగింది, ఇందులో కంటి అద్దాల కోసం ఎంపికైన 44మందికి అసోసియేషన్ అధ్యక్షుడు కై తపల్లి శ్రీనివాసరావు వీటిని పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ శిబిరంలో పరీక్షల ద్వారా ఆపరేషన్లు అవసరమైన వారికి ఆపరేషన్లు చేయించామని తెలిపారు. ఇటువంటి వైద్య శిబిరాలను మరిన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో సభ్యులు వెంపాడ శ్రీనివాసరెడ్డి, వాండ్రాసి సతీష్‌కుమార్, పి.అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడు మృతి



కుడిపూడి అరుణ్ కుమార్ (ఫైల్)

మధురవాడ: పాత మధురవాడ మెట్ట సీపీఐ శాఖ కార్యదర్శి కుడిపూడి అరుణ్‌కుమార్ (55) అనారోగ్యంతో బుధవారం మధ్యాహ్నం మృతి చెందారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు, పార్టీ కార్యదర్శి వి.సత్యనారాయణ తదితరులు సీపీఐ జెండా కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. అరుణ్ కుమార్ మృతి ఆ పార్టీకి తీరని లోటు అని అన్నారు. గురువారం ఉదయం 8 గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

శాంతినికేతన్ నారాయణ రావు ఇక లేరు



నారాయణరావు (ఫైల్)

పద్మనాభం: డీసీసీ మాజీ కార్యదర్శి సూరకాశి నారాయణరావు (81) తన స్వగ్రామం రెడ్డిపల్లిలో బుధవారం మృతి చెందారు. వార్ధక్య సమస్యలతో ఆయన మృతి చెందారని, గురువారం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసిన నారాయణరావు 1977లో రెడ్డిపల్లిలో శాంతినికేతన్ పాఠశాలను స్థాపించారు. ఇది ఉత్తరాంధ్రలో తొలి రెసిడెన్షియల్ ప్రైవేట్ పాఠశాల. ఈ పాఠశాల ప్రాంగణంలోనే నారాయణరావు ఉత్తరాంధ్ర ప్లీనరీ కాంగ్రెస్ సమావేశాలు నిర్వహించారు. ఈయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ఫైజర్ అటానమస్ టీమ్స్ గ్రాడ్యుయేషన్ డే



పట్టభద్రుల దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

కొమ్మాది: గీతం, ఫైజర్ ఆటానమస్ టీమ్స్ సంయుక్తంగా గీతంలో పట్టభద్రుల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఫైజర్ వైస్‌ప్రెసిడెంట్ బి. మురళీధర్ శర్మ మాట్లాడుతూ ఫైజర్ అటానమస్ టీమ్స్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుని మొదటి బ్యాచ్‌గా చేరిన విద్యార్థులను ఆయన అభినందించారు. మహిళలు సాధికారత సాధించాలనే దృక్పథంతో సంస్థ గ్రాడ్యుయేషన్ కోర్సు నిర్వహిస్తోందన్నారు. గీతం వీసీ డా. ఎరోల్ డిసౌజా పాల్గొన్నారు.

ప్రవేశాలకు వేళాయె..



పాఠశాలలో విద్యార్థులు





చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

మధురవాడ: రాష్ట్రంలోనే పెద్దదిగా గుర్తింపు పొందిన పాఠశాల చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. ఐదెకరాల సువిశాల ప్రాంగణంలోని స్కూల్లో 3239 మంది విద్యార్థులు, 104 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఇక్కడి విద్యార్థులు వివిధ రంగాల్లో ఉత్తమంగా నిలవడంతో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు ఇందులో చేరుతుంటారు. పాఠశాలలో 2025–26 విద్యాసంవత్సరంలో ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి.

సువిశాల ప్రాంగణం

సువిశాల క్రీడా ప్రాంగణం, పరిసరాలు పాఠశాల ప్రత్యేకత. మధురవాడలో పాఠశాల గేటును ఆనుకునే బస్ స్టాప్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ (బాల, బాలికలకు వేర్వేరుగా), స్కౌట్స్ అండ్ గైడ్స్, గ్రీన్ కార్ప్స్ వంటివి ఉన్నాయి. ఇక్కడ కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, సైన్స్‌లో ఎన్ఎస్, పీఎస్‌లకు వేర్వేరు ల్యాబ్స్, అల్లికలు, చేతి వృత్తుల్లో శిక్షణ ఇస్తున్నారు. గత కొద్ది సంవత్సరాలుగా ఇక్కడి విద్యార్థులు అన్నింటా ముందు ఉంటున్నారు. విద్యా సంవత్సరం పూర్తిగా ప్రారంభం కాకముందే ఇక్కడ అడ్మిషన్ల కోసం విద్యార్థులు ప్రతి ఏటా క్యూ కడుతూ ఉంటారు.

పాఠశాలలో వసతులివీ..

సుమారు 5 ఎకరాల ప్రాంగణంలో ఉన్న పాఠశాలలో 60 తరగతి గదులు ఉన్నాయి. ప్రతి తరగతికీ 8 నుంచి 11 సెక్షన్ల చొప్పున మొత్తం 62 సెక్షన్లు నిర్వహిస్తున్నారు. ప్రతి సెక్షన్‌కు 70 నుంచి 80 మంది విద్యార్థులు ఉన్నారు. అన్ని తరగతి గదులకు ఐఎఫ్‌పీ ప్యానల్స్, ప్రతి గదికి రెండు సీలింగ్ ఫ్యాన్‌లు, రెండు ట్యూబ్ లైట్లు ఉన్నాయి. బాలికలకు 25, బాలురకు 20 మొత్తం 40 బాత్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ఆర్‌వో ప్లాంట్, ఒక బోరుతో పాటు నిత్యం నీరు అందించే జీవీఎంసీ ట్యాప్ ఉంది. పాఠశాల చుట్టూ పచ్చని మొక్కలు స్వాగతిస్తాయి. సువిశాల క్రీడా మైదానం. బాస్కెట్ బాల్, ఇతర కోర్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

2024-25 విద్యా సంవత్సరంలో

విద్యార్థుల సంఖ్య

తరగతి	విద్యార్థులు	సెక్షన్లు
6	486	10
7	563	11
8	637	12
9	754	15
10	799	15
మొత్తం	3239	62

10వ తరగతి ఫలితాలు

పరీక్షలకు హాజరైన విద్యార్థుల సంఖ్య	:799
పాసైన విద్యార్థులు	:531
ఉత్తీర్ణత శాతం	:67
550 పైగా మార్కులు సాధించిన వారు	:22
500కు పైగా మార్కులు సాధించిన వారు	:90

ప్రత్యేకతలివీ..

రాష్ట్రంలోనే పెద్ద పాఠశాల

విస్తీర్ణం	: 5 ఎకరాలు
విద్యార్థుల సంఖ్య	: 3,239
ఉపాధ్యాయులు	: 104
తరగతి గదులు	: 60

అన్ని తరగతులకు ఐఎఫ్‌పీ ప్యానల్స్



తరగతి గదిలో ఐఎఫ్‌పీ ద్వారా బోధిస్తున్న ఉపాధ్యాయుడు



అడ్మిషన్ల కోసం వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సూచనలు ఇస్తున్న హెచ్ఎం రవి



స్కూల్లో బాస్కెట్‌బాల్ కోర్టు

ఈ స్కూలంటే మంచి క్రేజ్



మధురవాడ పరిసర ప్రాంతాల్లో చంద్రంపాలెం హైస్కూల్ అంటే అందరిలోనూ మంచి క్రేజ్ ఉంది. చాలామంది ప్రైవేటు స్కూళ్లలో మానిపించి ఇక్కడ చేరుస్తుంటారు. ఇక్కడి వసతులు, చదువు అంతా బాగుంటుంది. మా పిల్లలను ఇక్కడ చదివించడం గొప్పగా భావిస్తున్నాం.

– జె. అచ్యుతరావు, పీఎంసీ చైర్మన్

అడ్మిషన్లకు ప్రత్యేక బృందాలు



పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయి. 10వ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల కారణంగా సాయంత్ర పూట అడ్మిషన్లు జరుగుతున్నాయి. వచ్చే నెల 1 నుంచి అడ్మిషన్లకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రవేశాలకు సంబంధించి ఏ ఇబ్బందులు ఉన్నా మమ్మల్ని నేరుగా సంప్రదించవచ్చు.

–రవి, హెచ్ఎం

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

భీమునిపట్నం: స్థానిక సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనులు, మరమ్మతుల కారణంగా భీమిలి, పరిసర ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఈ కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు భీమిలి, నేరెళ్లవలస, జె.వి.అగ్రహారం, కొత్తవలస, నిడిగట్టు, కుమ్మరిపాలెం, స్మిత్ వీధి, తోట వీధి, అప్పికొండవీధి, జగనన్న కాలనీ, బ్యాంక్ కాలనీ, రేఖవానిపాలెం, మూలకుద్దు, మహాలక్ష్మీపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

తగరపువలస: ఆనందపురం మండలం ఆనందపురం, కొంత్యాం సబ్ స్టేషన్ల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా కణమాం, ఎర్రవానిపాలెం, గోరింట, అయ్యవారి కణమాం, భీమన్నదొరపాలెం, కోలవానిపాలెం, బంటుమెరక, ఆనందపురం గ్రామం, విలేకరుల కాలనీ, సుఖీభవ లే అవుట్, చందక, పొడుగుపాలెం, గొట్టిపల్లి, ఏనుగులపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

పీఎం పాలెం పరిధిలో..

పీఎం పాలెం: పీఎం పాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ ఏరియాలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 8 గంటలనుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పి. శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా బబ్బేలమ్మ గుడి ఏరియా, విజేత సూపర్ మార్కెట్ రోడ్, కారుషెడ్ ఏరియా, పాత పెప్సీ కంపెనీ ఏరియా, పిలకవానిపాలెం తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తామన్నారు.

పద్మనాభం మండలంలో..

పద్మనాభం: పాండ్రంగి, రెడ్డిపల్లి ఫీడర్ల పరిధిలో లైన్లకు మరమ్మతులు చేపట్టనున్నందున ఈ ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని జోన్-3 ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. రెడ్డిపల్లి ఫీడర్ పరిధిలోని పొట్నూరు, శేరిఖండం, తునివలస, నరసాపురం, చిన్నాపురం, కొయ్యపేట, నేరేళ్లవలస, పాండ్రంగి ఫీడర్ పరిధిలోని మునివాని పాలెం, సామయ్యవలస గ్రామాలకు విద్యుత్ పరఫరాకు అంతరాయ కలుగుతుందని పేర్కొన్నారు.

అనధికార నిర్మాణాల తొలగింపులో అలసత్వం

- నామమాత్రంగా తొలగించి మమ అనిపిస్తున్న అధికారులు



నామమాత్రంగా తొలగించిన అక్రమ నిర్మాణం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో అనధికార నిర్మాణాల తొలగింపులో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. డ్రైనేజీలపై, రోడ్డును ఆనుకుని, అనుమతులు లేకుండా నిర్మించిన వాటిపై స్థానికుల నుంచి వినతులు అందుతున్నా అధికారులు మాత్రం నామమాత్రంగా పనులు చేసుకుని వెళ్లిపోతున్నారు. వారి పనితీరుకు నిదర్శనాలు కోకొల్లలు..

- సాగర్‌నగర్ పరిధి సుభాష్‌నగర్‌లో ఓ వ్యక్తి కాల్వను ఆక్రమించుకుని వాటిపై కమర్షియల్ కట్టడం నిర్మించడంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై వారి స్పందన మాత్రం నామమాత్రంగా ఉంది. ఆ నిర్మాణాన్ని సగం తొలగించి మమ అనిపించారు. అధికారుల పనితీరుపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి స్థాయిలో తొలగించాల్సింది పోయి సగం తొలగించడంలో అంతరార్థం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.
- ఇదే వార్డులో శాంతినగర్ కొండపై ఓ వ్యక్తి స్థలాన్ని ఆక్రమించి బహుళ అంతస్తును అనధికారికంగా నిర్మిస్తున్నా, ముసలయ్యపాలెంలో ప్రభుత్వ స్థలం ఆక్రమించి సామాజిక భవనం పేరిట అనధికారికంగా ఓ భవనం నిర్మిస్తున్నా.. అధికారులకు తెలిసినా ఇటుగా చూడటంలేదు. అ అనధికారిక నిర్మాణాలపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు.

అధికారుల నిర్లక్ష్య ధోరణి ఇదే విధంగా కొనసాగితే వార్డులో అనధికారిక నిర్మాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకువస్తాయని సీనియర్ సిటిజన్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు నిర్లక్ష్యం వీడి వార్డు పరిధిలో నిర్మితమవుతున్న అనధికారిక నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హనుమజ్జయంతికి ఏర్పాట్లు

తగరపువలస: హనుమజ్జయంతికి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. గురువారం నిర్వహించనున్న వేడుకలకు ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి.

10వేల తమలపాకులతో అర్చన

సంగివలస శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 20 నుంచే అర్చకుడు ఆదిత్యశర్మ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలతో పాటు 2వ వార్షికోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గురువారం ఈ ఆలయంలో 10వేల తమలపాకులతో దశ సహస్రనామార్చన, మధ్యాహ్నం అన్నదానం, అనంతరం అశ్వరథ కోలాటంతో భారీ ఊరేగింపు నిర్వహించనున్నారు.

- కొండపేట గోస్తనీనది అప్రోచ్ రోడ్డులో కొత్తగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, వ్రతాలు, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నారు.

అన్న సమారాధనలు


తగరపువలస అంబేడ్కర్ కూడలి, సంగివలస అల్లూరి సీతారామరాజు కాలనీ, భీమిలి మండలం తాళ్లవలస, తాటితూరు కూడలి, మజ్జివలస, టి.నగరపాలెం, పెదనాగమయ్యపాలెం, చిట్టివలస, బ్యాంకు కాలనీ, అన్నవరం, చిల్లపేట, జీరుపేట, మూలకుద్దు తదితర ప్రాంతాలలో హనుమాన్ జయంతి వేడుకలతో పాటు భారీ అన్నసమారాధనలు నిర్వహించనున్నారు. ఆనందపురం మండలంలోని దుక్కవానిపాలెం, పెద్దిపాలెం, వెల్లంకి, గుడిలోవ, గంభీరం, దబ్బంద, రామవరం, కుసులవాడలోనూ ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు.



కొండపేట గోస్తనీనది అప్రోచ్ రోడ్డులో హనుమాన్ ఆలయం వద్ద ఏర్పాట్లు

దాసాంజనేయస్వామి ఆలయంలో..

భీమునిపట్నం: భీమిలిలోని శ్రీదాసాంజనేయ స్వామి ఆలయంలో వంశీమోహన చెన్న కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకు 108 కొబ్బరికాయలతో పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు శ్రీరామ నామ సంకీర్తన, హనుమాన్ చాలీసా, హనుమత్ వైభవం గురించి పురాణ ప్రవచనం వినిపించనున్నారు. ఆలయంలో జూన్ 5న సువర్చల దాసాంజనేయస్వామికి తిరు కల్యాణం జరిపించనున్నారు.



ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించిన విగ్రహం

పద్మనాభంలో..

పద్మనాభం: హనుమజ్జయంతికి ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. పద్మనాభం, మద్ది, రేవిడి జంక్షన్, కృష్ణాపురం, కోరాడ, తునివలస, అనంతవరం, పాండ్రంగి, కురపల్లి, పెంట గ్రామాల్లోని అభయాంజనేయ స్వామి ఆలయాలను ముస్తాబు చేశారు. ఆలయాల ముందు పందిళ్లు వేసి, విద్యుద్దీపాలతో అలంకరించారు.

అయ్యవార్ల నిర్లక్ష్యం



గేటు తెరిచి ఉన్న ఆనందపురం జెడ్పీ హైస్కూల్

- పాఠశాలలో తెరిచి ఉన్న తరగతి గదులు
- విలువైన సామగ్రికి నష్టం వాటిల్లే ప్రమాదం



తెరిచి ఉన్న రూమ్ నంబర్ 7

తగరపువలస: అయ్యవార్ల నిర్లక్ష్యంతో పాఠశాలల్లో విలువైన సామగ్రికి నష్టం వాటిల్లే ప్రమాదం కనబడుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడు పథకం ద్వారా లక్షలు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించించారు. పాఠశాల భవనాలు, తరగతి గదులు, ఫర్నిచర్, టాయిలెట్లు, తాగునీటితో పాటు ఖరీదైన డిజిటల్, గ్రీన్ బోర్డులు ఏర్పాటు చేసింది. వీటిని పరిరక్షించుకోవడంలో ప్రస్తుత ఉపాధ్యాయులు నిర్లక్ష్యాన్ని కనపరుస్తున్నట్టు ఆనందపురం జెడ్పీ హైస్కూల్‌ను చూస్తే తెలుస్తోంది. ప్రస్తుతం వేసవి సెలవుల కారణంగా స్కూల్ మూసి ఉంది. కానీ పాఠశాల ఆవరణలో వాకర్ల కోసం గేటును పాక్షికంగా తెరచి ఉంచారు. లోపలికి వెళ్లి చూస్తే వరండాల గేట్లకు తాళాలు వేసి ఉండగా, తరగతి గదుల తలుపులు మాత్రం బార్లా తెరిచి ఉన్నాయి. ఆకతాయిలు ఎవరైనా లోపలికి ప్రవేశించి, రాళ్లు విసిరితే డిజిటల్ బోర్డులకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. దీంతో పాఠశాలతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుంది. ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉపాధ్యాయులు ముందు జాగ్రత్తగా తరగతి గదుల తలుపులు కూడా మూసి ఉంచాలని పాఠశాల చుట్టుపక్కల ప్రజలు కోరుతున్నారు.

రెడ్డిపల్లి సచివాలయం ఆకస్మిక తనిఖీ



సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో విజయ్ కుమార్

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి సచివాలయాన్ని ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి రికార్డులను పరిశీలించారు. స్వామిత్వ తదితర ప్రభుత్వ సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.

ముడసర్లోవ వద్ద రైల్వే జోన్ పనులు

ఆరిలోవ: ముడసర్లోవ వద్ద రైల్వే జోన్ పనులు జరుగుతున్నాయి. ఇక్కడ సుమారు 56 ఎకరాల భూమిని రైల్వే జోన్ కోసం కేటాయించిన విషయం తెలిసిందే. రెండు నెలల కిందట ఈ స్థలాన్ని చదును చేసి భూ పరీక్షలు(సోయిల్ టెస్టింగ్) చేపట్టారు. అనంతరం నిర్మాణ పనులు ప్రారంభించారు. కొద్ది రోజులుగా నిర్మాణానికి అవసరమైన సామగ్రి సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఇసుక, పిక్క, ఇటుకలు తదితర సామగ్రి నిల్వ చేశారు. ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది కోసం ప్రత్యేకంగా గదులు నిర్మించారు. ప్రాజెక్టుకు సంబంధించిన భవన నిర్మాణాల కోసం యంత్రాలతో పనులు చేయిస్తున్నారు. ఒకప్పుడు నిర్మానుష్యంగా ఉండే ఈ ప్రాంతం.. భారీ యంత్రాలు, లారీలు, పనులు చేసే కూలీలతో సందడిగా మారింది.

బ్యాడ్మింటన్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పరిపాలన భవనంలోని మహిళా సిబ్బందికి నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలకు బుధవారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎస్.ధనంజయరావు బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో 31 మంది మహిళా సిబ్బంది పాల్గొన్నారు. విజేతగా డిప్యూటీ రిజిస్ట్రార్ ఎల్.మంజుల, రమా దుర్గ టీమ్ నిలిచారు. ద్వితీయ స్థానంలో ఎన్.సునీత, వై.శివకుమారి, పి.దీపిక టీమ్, తృతీయ స్థానంలో సిహెచ్.జ్యోతికుమారి, మమత టీమ్‌లు నిలిచాయి. ఈ సందర్భంగా విజేతలను రిజిస్ట్రార్ అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఫైనాన్స్ ఆఫీసర్ వి.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనంజయరావు

ఎక్కడి చెత్త అక్కడే ..

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో పారిశుధ్య నిర్వహణను గాలికి వదిలేశారు. దీంతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి ఉంది. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఒకవైపు చెత్త నుంచి వస్తున్న దుర్గంధం భరించలేక, మరోవైపు దోమల బాధతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఎండాడ, ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, దుర్గానగర్, రామాలయం వీధి ప్రాంతాల్లో రోడ్డుమీదే చెత్త పెద్ద ఎత్తున పోగైంది. దీంతో ఇటుగా రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



దుర్గానగర్‌లో రోడ్డు మీద చెత్త

ప్లాట్‌ఫాం నిర్మించారు

సాక్షి ఎఫెక్ట్..



సంతపేటలో బోరుబావి వద్ద నిర్మించిన ప్లాట్‌ఫాం

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు సంతపేట రెడ్డివీధిలో బోరుబావి వద్ద ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది బుధవారం ప్లాట్‌ఫాం నిర్మించారు. బోరుబావి వద్ద ప్లాట్‌ఫాం లేకపోవడంతో మహిళలు నీళ్లు పట్టుకునేందుకు ఇబ్బంది పడేవారు. దీనిపై 'మరమ్మతులు చేశారు..ప్లాట్‌ఫాం మరిచారు' శీర్షికతో ఈ నెల 19న సాక్షిలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించి, తక్షణం పనులు చేపట్టారు. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.